
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 20.811 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం 20.811 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 13,480 క్యూసెక్కుల వంతున వరద వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60.500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,490
3శాతం జీఎస్టీతో	రూ.5,655
నవర (8గ్రా)	రూ.45,240

గరిష్టం/కనిష్టం
37.0/27.5

వాతావరణం

వాతావరణంలో తేమ 50 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు హైకోర్టు న్యాయమూర్తుల రాక

నెల్లూరు (లీగల్) : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నైనాల జై సూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ మన్మథరావు శనివారం నెల్లూరుకు రానున్నారని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో జరిగే దివంగత న్యాయవాదుల చిత్రపటాల ఆవిష్కరణ, సీనియర్ న్యాయవాదుల సన్మాన కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య పర్యవేక్షణలో జరిగే కార్యక్రమానికి న్యాయవాదులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జెడ్పీలో పదోన్నతులు



పదోన్నతులు పొందిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ చిరంజీవి

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య సంస్థ పరిధిలో పనిచేస్తున్న 24 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ సీఈఓ చిరంజీవి, చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వారు జెడ్పీ కార్యాలయంలో పదోన్నతులు పొందిన ఉద్యోగులను అభినందించి పత్రాలు అందజేశారు. 24 మంది ల్యాబ్ రికార్డు అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. కారుణ్య నియామకా ల కింద ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్లు, ఒకరికి టైపిస్టు, మరొకరికి ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యో గావకాశాలు కల్పించారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశాలు, పదోన్నతులు కల్పించిన సీఈఓ, చైర్‌పర్సన్‌కు పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పెంచలయ్య, రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

22 నుంచి ఐటీఐ నాల్గో విడత కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 22, 23 తేదీల్లో నాల్గో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ప్రభుత్వ, 23న ప్రైవేట్ ఐటీఐల్లో చేరేందుకు కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకుంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందస్తుగా ఈ నెల 20న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు.

పొదుపు మహిళలకు స్త్రీనిధి రుణాలు

- డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి



పేటీఎం మెషిన్లు అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపుల మహిళలకు సకాలంలో స్త్రీనిధి రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. గురువారం డీఆర్డీఏ కార్యాలయంలో ఏపీఎం, సీసీలు, స్త్రీనిధి అధికారులతో పీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గతంలో గ్రూపులో పది మంది సభ్యులు ఉంటే ముగ్గురికి మాత్రమే స్త్రీనిధి రుణాలు మంజూరు చేసేవారమని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గ్రూపులోని పది మంది సభ్యులకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో అవకతవకలు జరగకుండా పేటీఎం మెషిన్లు అందజేస్తున్నామని చెప్పారు. దీంతో పొదుపు సభ్యులు బ్యాంకు ఖాతా నుంచి నేరుగా రుణాలను చెల్లించవచ్చని వివరించారు. అనంతరం ఏపీఎంలు, సీసీలకు పేటీఎం మెషిన్లు అందజేశారు. ఈ సమావేశంలో స్త్రీనిధి ఏజీఎం కామక్షయ్య పాల్గొన్నారు.

పర్యాటక శాఖ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ అందజేయనున్న అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి పొన్నగంటి సాయికృష్ణ గురువారం తెలిపారు. పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి పోటీలు నిర్వహించి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు www.tourisam.gov.in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 19 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని కోరారు.



ఆస్తి భద్రం

పల్లెల్లో భూములు,జనావాసాలు, గ్రామకంఠాల సమగ్ర సర్వే

- పక్కాగా ఆస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- ప్రత్యేకంగా గ్రామాల మ్యాప్‌ల తయారీ
- ఆస్తి హక్కు పత్రాల పంపిణీకి రంగం సిద్ధం

పల్లెల్లో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న పొలాలు, ఇళ్ల స్థలాల సమస్యలకు పరిష్కార మార్గాన్ని ప్రభుత్వం సుగమమం చేస్తోంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం కింద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రోన్ల సాయంతో భూముల రీ సర్వే చేపడుతోంది. గ్రామసభల ద్వారా భూసమస్యలను పరిష్కరించి భూముల వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది.

నెల్లూరు (దర్గామిట్ట): పల్లెలోని భూములు, గృహాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ కంఠం స్థలాలను సమగ్రంగా రీసర్వే చేసి యాజమాన్య ఆస్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూములను సమగ్రంగా రీసర్వే చేపట్టి రికార్డులను పక్కాగా ఆన్‌లైన్ చేస్తున్నారు. అలాగే సర్వే సెటిల్‌మెంట్ భూ రికార్డుల కమిషనర్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా డ్రోన్ల సాయంతో జిల్లాలోని జనావాసాలు,



కావలి మండలం ముంగమూరులో రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్(ఫైల్)

గ్రామకంఠాలను రీ సర్వే చేస్తున్నారు. రీసర్వే ఎలా చేయాలనే అంశాలపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ సైతం ఇచ్చారు. గ్రామాల్లో గ్రామ సభల ద్వారా ప్రజలకు ముందస్తు సమాచారం అందించి ఎంపిక చేసిన కమిటీల ఆధ్వర్యంలో పక్కాగా రీసర్వే చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకునేందుకు కూడా జిల్లా అధికార యంత్రాంగం వెనుకాడడం లేదు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ఎం హరినారాయణన్ జిల్లాలో జరుగుతున్న రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతి వారం రీసర్వేపై రెండుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, హద్దురాళ్ల ఏర్పాటు, తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. రీ సర్వేకు సంబంధించి లక్ష్యాలను నిర్దేశించి, వాటిని సాధించేందుకు చేయాల్సిన పనులపై ప్రత్యేక సూచనలు చేస్తున్నారు.

త్వరలో హక్కు పత్రాలు

జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని ప్రజలకు త్వరలో యాజమాన్య ఆస్తి హక్కు పత్రాలను అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి హక్కు పత్రాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

హక్కు పత్రంలో ఏఏ వివరాలు ఉంటాయంటే...

సర్వే, మ్యాపింగ్ పూర్తయిన అనంతరం ప్రభుత్వం ఆస్తుల యజమానులకు ధ్రువపత్రాలను జారీ చేస్తోంది. ఈ పత్రంలో యజమాని పేరు, తండ్రి పేరు, చిరునామా, గ్రామ పంచాయతీ పేరు, గ్రామ పంచాయతీ కోడ్, గ్రామ సభ నిర్వహించి తీర్మానం చేసిన తేదీ, ఆస్తి అసెస్‌మెంట్ నంబరు, నివాస గృహ వర్గీకరణ, భవన వినియోగం (గృహ/వాణిజ్య, సంయుక్త) ఆస్తికి సంబంధించిన యూనిక్ నంబరు, ఆస్తి సంరక్షణ వివరాలు పొందుపరిచి ఉంటాయి.

జిల్లాలో రీ సర్వే పురోగతి

డ్రోన్ సర్వే చేపట్టిన పంచాయతీలు	- 724
ఓఆర్ఐ పూర్తయినవి	- 349
షేప్ ఫైల్స్ పూర్తయినవి	- 215
గ్రౌండ్ ట్రూతింగ్ ధ్రువీకరించినవి	- 215
13వ నోటిఫికేషన్ పూర్తయినవి	- 215
ఆర్వోఆర్ ప్రచురించినవి	- 214
ఫైనల్ ఆర్వోఆర్ ప్రచురించిన పంచాయతీలు	- 32



డ్రోన్‌తో సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది(ఫైల్)

రీసర్వేలో నమోదు అంశాలు

రీసర్వేలో అనేక అంశాలకు సంబంధించి వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించి సర్వే నంబరు, యజమాని పేరు, తండ్రి పేరు, విస్తీర్ణం, సంబంధిత ఆస్తులు ఎలా సంక్రమించాయి (పిత్రార్జితమా, కొనుగోలు చేసినవా), కొలతలు, సరిహద్దులు, యజమాని ఫోన్ నంబరు, తదితర విషయాలను నమోదు చేస్తున్నారు. రీ సర్వే నేపథ్యంలో జిల్లాలోని 724 గ్రామ పంచాయతీల్లోని వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడంతో పాటు ఆయా గ్రామాలకు సంబంధించి ప్రత్యేకంగా మ్యాప్‌లను రూపొందించే ప్రక్రియ వేగం పుంజుకుంది.



రీసర్వేతో ఆస్తులు భద్రం



రీ సర్వేతో ఆస్తులకు పూర్తి భద్రత, భరోసా లభిస్తుంది. గ్రామాల్లోని అపరిష్కృత భూ సమస్యలు పరిష్కారమవుతాయి. రీ సర్వేను కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వారం, పదిహేను రోజుల లక్ష్యాలను నిర్దేశించి గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ సమగ్రంగా, పటిష్టంగా చేపట్టేలా సూచనలు ఇస్తున్నారు. రీ సర్వేపై క్షేత్రస్థాయి సిబ్బంది ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక సూచనలు జారీ చేశాం. గ్రామాల్లో రీ సర్వే చేపడుతున్న సమయంలో రైతులు, గ్రామస్తులు సహకరించాలి.

– అన్నవరం హనుమాన్‌ప్రసాద్, ఏడీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్



మైపాడు సభలో మాట్లాడుతున్న ఎంపీలు వేమిరెడ్డి, బీద, ఆదాల, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, సభకు హాజరైన జనసందోహం

మహాయజ్ఞంలా లక్ష గడపలు

- ప్రతిఒక్కరి సహకారంతో విజయవంతంగా పర్యటన
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో గతేడాది ఆగస్టు 1న ప్రారంభించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం 13 నెలల పాటు మహాయజ్ఞంలా సాగిందని, ఇందులో ప్రతిఒక్కరి సహకారం ఎనలేనిదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం లక్ష గడపలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇందుకూరుపేట మండలం మైపాడులో గురువారం భారీ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ గతేడాది జొన్నవాడలోని కామాక్షితాయి సన్నిధిలో కార్యక్రమాన్ని ప్రారంభించి నేడు మైపాడులోని ప్రసన్న విశ్వేశ్వరుని సన్నిధిలో లక్ష గడపలను పూర్తి చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గడప గడపకు కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందడంతో తన పర్యటనకు ప్రజల నుంచి విశేషాదరణ లభించిందన్నారు. ఇప్పటి వరకు లక్ష గడపలు పూర్తి చేశామని, మరో మూడ్రోజుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముగిస్తామన్నారు. మైపాడులో సభ విజయవంతానికి కృషి చేసిన కల్యాణ్‌రెడ్డి, పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. మైపాడు అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామన్నారు. మైపాడును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి కల్యాణ్‌రెడ్డికి మంచి పేరు తెస్తామన్నారు. మరో ఆరు నెలల్లో రానున్న ఎన్నికల్లో జగనన్న ఆశీర్వాదంతో కోవూరు ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్న తనను, నెల్లూరు ఎంపీగా పోటీ చేయనున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

అలుపెరగని పోరాట యోధుడు ఎమ్మెల్యే ప్రసన్న–ఎంపీ ఆదాల

ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష గడపలు తిరగడం సామాన్యమైన పనికాదన్నారు. అలుపెరగని పోరాట యోధుడిగా ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి నడిచారన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎక్కడ ఏ ఆపద వచ్చినా తానున్నాంటూ ప్రసన్న తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రసన్నకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సమకూర్చడంలో ప్రసన్న ఎంతో కృషి చేస్తారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, ప్రసన్నను ఎమ్మెల్యేగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే విషయం అర్థమవుతోందన్నారు. ప్రసన్నకు తనతో పాటు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు వీలైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

లక్ష గడపలు తిరగడం ఓ పెద్ద విజయం– ఎంపీ వేమిరెడ్డి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే ప్రసన్న ఎంతో కష్టపడ్డారన్నారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్నాయా.. లేదా అని తెలుసుకోవడం, లక్ష గడపలు తిరగడం ఒక పెద్ద విజయమన్నారు. దేవుడి ఆశీస్సులు, ప్రజల ఆదరాభిమానాలు ఆయనకు ఉండాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్, ఎమ్మెల్యేగా ప్రసన్నను గెలిపించుకోవాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంచి వేదికన్నారు. లక్ష గడపలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే ప్రసన్నకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి, వైఎస్సార్‌సీపీ యువ నేతలు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఆప్కాబ్ చైర్మన్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం కిక్కు దిగాల్సిందే

- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా రూ.10 వేలకు పెంపు

నెల్లూరు(క్రైమ్): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే కోర్టులో నామమాత్రపు జరిమానా చెల్లించి వెళ్లొచ్చు అనుకుంటే ఇక కుదరదు. ఇప్పటి వరకు ఒక లెక్క ఇకపై మరో లెక్క అన్న చందాన ఇకపై డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే భారీగా అపరాధ రుసుం చెల్లించాల్సిందే. ఒక్కోసారి నగదుతో పాటు జైలు శిక్ష అనుభవించక తప్పదు. జిల్లాలో మద్యం మత్తులో ఘర్షణలు, రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. దీంతో అన్నీ పోలీసుస్టేషన్‌ల పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి కోర్టులో అపరాధ రుసుం కట్టిస్తున్నారు. ఇప్పటి వరకు పరీక్షల్లో పట్టుబడిన వాహన చోదకులు కోర్టులో రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు జరిమానా చెల్లించేవారు. అధికంగా మద్యం సేవించి ఉంటే జైలు శిక్ష అనుభవించేవారు. అయినా మార్పురాకపోవడంతో అపరాధ రుసుంను రూ.10 వేలకు పెంచారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే ఇకపై అక్షరాల రూ.10 వేలు జరిమానా కట్టాల్సిందే. మద్యం పర్సంటేజ్ అధికంగా ఉంటే జైలు తప్పదు. దీంతో మద్యం తాగి వాహనాలు నడపాలంటే భయపడే పరిస్థితి వస్తుందని, తద్వారా ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.


ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రావు



నూతన కమిటీతో వెంకటరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా చేజర్ల సుధాకర్ రావు ఎన్నికయ్యారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ఫెడరేషన్ జనరల్‌బాడీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా జనరల్ సెక్రటరీగా దేవిరెడ్డి రమణారెడ్డి, ట్రెజరర్‌గా బాలరాజు, కన్వీనర్‌గా హరీష్, వైస్ చైర్మన్ సునీల్‌శర్మ, తదితర 20 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఏపీజీఈఎఫ్ ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. ఎంపీడీఈఓలకు పదోన్నతులు ఇప్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏపీజీఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఉద్యోగులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఓటరు జాబితా అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): ఓటరు జాబితాకు సంబంధించి చేపట్టిన ఇంటింటి సర్వేలో గుర్తించిన, పెండింగ్‌లో ఉన్న అన్ని ఓటరు క్లైయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 15లోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. గురువారం డీఆర్వో చాంబర్‌లో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణపై వారాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నామన్నారు. ఇంటింటి సర్వేలో బీఎల్వోలు నమోదు చేసిన అన్ని ఫారమ్స్‌ను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వచ్చిన క్లైయిమ్‌లను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. పక్కాగా ఓటరు జాబితా తయారీకి జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధి మందల వెంకట శేషయ్య, టీడీపీ ప్రతినిధులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వరప్రసాద్, బీజేపీ ప్రతినిధులు శ్రీనివాస్, రాజేంద్రరెడ్డి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు దయాకర్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 15 నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రాధాన్యత ఇండికేటర్ లక్ష్యసాధన, మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, నూరు శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, మనబడి నాడు–నేడు, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల అమలుపై సమీక్షించి సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై ఈ నెల 15 నుంచి వలంటీర్లతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. 16 నుంచి ఏఎన్ఎం/సీహెచ్ఓల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, మలేరియా, డెంగీ, తదితర వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 30 నుంచి మండలాల్లో ప్రతిరోజూ వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. సాధారణ వైద్యులతో పాటు వైద్యనిపుణులు పాల్గొని సేవలందించేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేసేలా చూడాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ ఎం హరినారాయణన్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన, మున్సిపల్ ఏఈ సంపత్‌కుమార్, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ హాజరయ్యారు.

క్లుప్తంగా

మీ పనితీరు మెరుగుపరుచుకోవాలి

• డీఎంఈ నరసింహం

నెల్లూరు(సెంట్రల్): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం కొందరు ప్రభుత్వ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధవారం ఆయన నెల్లూరులోని జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం వైద్యరంగంపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని, పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తోందన్నారు. అయితే కొందరు చేసే తప్పిదాల వల్ల చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు బాగోలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని తక్షణమే సరిచేసుకుని వైద్యశాలకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సూపరింటిండెంట్ పర్యవేక్షణ పక్కాగా ఉంటే ఫిర్యాదులు రావు కదా అన్నట్లు తెలిసింది.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



నూనె నాణ్యతను పరిశీలిస్తున్న అధికారిణి

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(సెంట్రల్): ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం నెల్లూరులోని ఆహార పదార్థాలను విక్రయించే షాపులపై దాడులు నిర్వహించారు. బుధవారం సాక్షిలో 'కల్తీ.. సుస్తీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు చిల్డ్రన్స్ పార్కు, మాగుంట లేఅవుట్, దర్గామిట్ట ప్రాంతాల్లోని పానీపూరి, టిఫిన్ సెంటర్లు, మాంసాహార విక్రయాలను పరిశీలించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో అధికారులు వెంకటేశ్వర్లు, నీరజ, ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈఎన్‌టీ సదస్సు



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి ఈఎన్‌టీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన కాలేజీలో వివరాలు వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి 400 మందికిపైగా వైద్యులు ఈ సదస్సులో పాల్గొంటారన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి



ఘటనా స్థలంలో ట్రాక్టర్, శ్యామ్ మృతదేహం

వలేటివారిపాలెం (లింగసముద్రం): ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన లింగసముద్రం మండలంలోని ముక్తేశ్వరం చెరువు వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. లింగసముద్రం మండలంలోని మాలకొండరాయునిపాళెం గ్రామానికి చెందిన కసిరెడ్డి శ్యామ్ (23) అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఓ వ్యక్తి పొలంలో దుక్కి దున్నాడు. అనంతరం ఇంటికి వస్తుండగా ముక్తేశ్వరం చెరువు మలుపు వద్ద ఎదురుగా ఆటో వచ్చింది. ట్రాక్టర్ తోలుతున్న శ్యామ్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో ఉన్న చెరువులో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్యామ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

వైభవంగా అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



కలశ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ప్రముఖులు



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

• అమ్మవారి దర్శనానికి వేలాదికి తరలివచ్చిన భక్తులు
• పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి నూతన ఆలయం ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గురువారం శోభయామానంగా జరిగింది. మూడు రోజుల నుంచి జరుగుతున్న ఉత్సవాలు గురువారం చివరి అంకానికి చేరుకున్నాయి. ఉదయం నుంచే రుత్వికులు యజ్ఞశాలలో హోమాలు నిర్వహించారు. పలు పూజా క్రతువులను పూర్తి చేసిన రుత్వికులు అమ్మవారి ప్రధాన ఆలయంతోపాటు, ఉపాలయాల గోపురాలపై కలశ ప్రతిష్ట చేపట్టారు. అనంతరం అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి పాదాలచెంద బీజాక్షర బంగారు యంత్రాన్ని ఉంచడంతోపాటు, పీఠంపై విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తర్వాత యజ్ఞశాలలో పలు పూజా క్రతువులు నిర్వహించిన రుత్వికులు కలశాల ద్వారా అమ్మవారికి ప్రాణ ప్రతిష్ట చేశారు. అనంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహించి అలంకరణ పూర్తి చేసి సాధారణ భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. ఉత్సవాలను తిలకించేందుకు వేలసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

• కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి యజ్ఞశాలలో జరిగిన పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. అనంతరం రుత్వికులతో కలిసి కలశ ప్రతిష్టను నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం దంపతులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కుటుంబసభ్యులు, పలుశాఖలకు చెందిన అధికారులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి 20 వేల మంది భక్తులకు పైగా అన్నదానం చేశారు. ఏర్పాట్లను పక్కాగా చేయడంతోపాటు, మజ్జిగ, మంచినీరు పెద్దఎత్తున సరఫరా చేశారు.

గురువులు సమాజానికి మార్గదర్శకులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: 'గురువులు సమాజానికి మార్గదర్శకులు. విద్యార్థుల్ని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎంతో కీలకం.' అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపస్మా) ఉదయగిరి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయగిరిలో అల్ ఖైర్ ఫంక్షన్‌హాల్లో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. దేశ భవిష్యత్ టీచర్లపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. ఎలాంటి సమస్యలొచ్చినా వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తామని చెప్పారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు కూడా విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. ఫీజుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. గత పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రత్నం, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, శివప్రసాద్, విష్ణు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంఈఓ మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

ఆనం.. ఇదేనా మీ అనుభవం?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• వలంటీర్లు, నాయకులకు ఓట్లు తొలగించే అధికారం ఉందా?
• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: 'వలంటీర్లు, నాయకులు ఓట్లు తొలగిస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. వారికి ఆ అధికారం ఉందా?, 40 సంవత్సరాల రాజకీయ అనుభవంలో ఇదేనా ఆయన నేర్చుకుంది. ఓట్లను ఎలా తొలగిస్తారనే విషయం ఆనంకు తెలియకపోవడం శోచనీయం.' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సంగం వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో గురువారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంగం పీఏసీఎస్ కార్యాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, రెవెన్యూ సమస్యలను తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. గడప గడపకు కార్యక్రమం ఆదివారాలు, సెలవు రోజుల్లో సైతం కొనసాగిన విషయం ఆనంకు తెలిసి ఉంటే ఇలాంటి ఆరోపణలు చేసుండేవారు కాదన్నారు. ఆయన్ను గెలిపించిన వెంకటగిరి ప్రజలను గాలికొదిలేశారన్నారు. ఓట్ల తొలగింపుపై ఆనం చేసిన ఆరోపణలు నిరాధారమైనవని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీకి పెద్ద ఎవరూ లేరన్న విషయం తెలుసుకున్న ఆనం మీడియాలో ప్రముఖంగా కనిపించేందుకు ప్రయత్నించినట్లు అర్థమవుతోందన్నారు. ఆనం కార్యాలయానికి వచ్చిన సమయంలో తమ నాయకులు మర్యాదిచ్చి సమావేశం జరుగుతున్న విషయాలను వివరించారన్నారు. అయితే ఆయన కిందకు వెళ్లి ఇష్టానుసారం మాట్లాడడం సరికాదన్నారు. వీఆర్వోను పైకి తీసుకొచ్చి అతడిపై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల కోసం ఎంతో కష్టపడి పనిచేస్తున్న వలంటీర్లపై బురదజల్లడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మి, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, నాయకులు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, మానికల చందన్‌కుమార్, గంగపట్నం చంద్రశేఖరయ్య, గుండాల బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితం అవినీతిమయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడి జీవితం అవినీతిమయం. ఆయన చీకటి రాజకీయాలు వచ్చే ఎన్నికలతో సమాప్తం అవుతాయి.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ నుంచి పదవిని లాక్కున్న బాబు సీఎంగా ఉన్న సమయంలో ప్రజలను మోసం చేశాడన్నారు. తనది 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అని చెప్పే బాబు అధికారంలో ఉన్నప్పుడు తన మనుషులకు దోచిపెట్టాడన్నారు. వేదికలెక్కి ప్రజలకు నీతులు చెబుతుంటాడని, అలాంటి వ్యక్తి ఐటీ నోటీసులకు సమాధానం చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన జీవితమంతా కుట్రలు, కుతంత్రాలు, అవినీతే అన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టిన విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వ్యవస్థల్ని మేనేజ్ చేయడంలో బాబుకున్న నైపుణ్యం ఎవరికీ లేదన్నారు. రాజకీయాల్లో తనకంటే సీనియర్ దేశంలోనే లేరని బాబు చెబుతుంటాడని, నిజం ఏంటంటే ఆయన కుంభకోణాల చిట్టా చాలా పెద్దదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, అమర వేదగిరి, డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, కుందుర్తి శ్రీనివాసులు, జనిగర్ల మహేంద్ర యాదవ్, ఈతముక్కల బాలమురళిరెడ్డి తదితరులున్నారు.

మీకు నచ్చిన రంగంలో రాణించండి

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
• ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణమ్మ



యువతుల నృత్య ప్రదర్శన

నెల్లూరు(మినీబైపాస్): యువత తమకు నచ్చిన రంగంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. సెట్నెల్ (యువజన సంక్షేమ శాఖ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు గురువారం నెల్లూరులోని కొండాయపాళెంగేట్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అరుణమ్మ విచ్చేశారు. ముందుగా ఆమె స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందన్నారు. సెట్నెల్ సీఈఓ వి.నాగరాజకుమారి మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

విజేతలు వీరే..

యువజనోత్సవాల సందర్భంగా వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయి. జానపద నృత్యం గ్రూప్ విభాగం మొదటి స్థానంలో డి.లక్ష్మీత్రిష బృందం, రెండో స్థానంలో బి.సౌమ్య బృందం, వ్యక్తిగత విభాగం మొదటి స్థానంలో కె.కీర్తన, రెండో స్థానంలో ఎస్.సుప్రజ, జానపద సంగీతం వ్యక్తిగత విభాగం మొదటి స్థానంలో వి.తేజశ్విని, రెండో స్థానంలో ఎ.యామిని, పోస్టర్ మేకింగ్ విభాగం మొదటి స్థానంలో టి.ఆనందిత, రెండో స్థానంలో షేక్ సుహాభాను, స్టోరీ రైటింగ్ విభాగం మొదటి స్థానంలో ఎ.కృష్ణకృతిక, రెండో స్థానంలో షేక్ ఆఫ్రిన్ నిలిచారు. డీకేడబ్ల్యూ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ సీహెచ్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సెట్నెల్ సిబ్బంది, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

• రూ.20 లక్షలు తీసుకుని మహిళను మోసం చేసిన వ్యక్తి

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేసిన నిందితుడిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఇస్కాన్ సిటీకి చెందిన ఓ మహిళకు 2011 సంవత్సరంలో వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. ఆరు సంవత్సరాల అనంతరం భర్త యాక్సిడెంట్‌లో మృతిచెందాడు. తర్వాత ఆమె ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ పిల్లలను పోషించుకోసాగింది. ఈ క్రమంలో పిల్లల సంరక్షణార్థం రెండో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో తన వివరాలను గతేడాది వివిధ మ్యారేజీ బ్యూరోలకు పంపింది. గత అక్టోబర్‌లో కిశోర్ అనే వ్యక్తి జీవనసాథి మ్యారేజ్ బ్యూరోలో మీ ప్రొఫైల్ చూశానని, తాను విజయవాడలో నివాసం ఉంటూ రైల్వే ఉద్యోగం చేస్తున్నానని ఆమెకు ఫోన్ చేసి చెప్పడంతోపాటు ఐడీకార్డు పంపాడు. అనంతరం కిశోర్ ఆమె ఇంట్లో వారితో సైతం మాట్లాడి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. దీంతో వారందరూ అతడి మాటలు నమ్మారు. ఈ నేపథ్యంలో మనం పెళ్లి చేసుకుంటున్నాం కదా.. షేర్ మార్కెట్‌లో కొంత నగదు పెట్టుబడిగా పెడితే లాభాలు వస్తాయని అతను మహిళను ఒప్పించాడు. దీంతో ఆమె డిసెంబర్‌లో రూ.3 లక్షలు, ఈ ఏడాది జనవరిలో రూ.12 లక్షలు, ఫిబ్రవరిలో రూ.5 లక్షలు ఇలా మొత్తంగా రూ.20 లక్షలు ఇచ్చింది. కొంతకాలం తర్వాత ఆమెతో కిశోర్ మాట్లాడడం తగ్గించాడు. ఫోన్ చేస్తే సరిగ్గా సమాధానం చెప్పేవాడు కాదు. ఆమెకు అనుమానం వచ్చి అతని పేస్లిప్, ఐడీ కార్డు ఒరిజినల్, ఆధార్‌కార్డులు, డబ్బులు అడగడంతో అప్పటి నుంచి ఫోన్ లిఫ్ట్ చేయడం మానేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం



బాబు మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: కారు ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ బాబు (30) మృతిచెందిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని లైలా పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కారు బుచ్చి నుంచి నెల్లూరుకు వెళ్తోంది. ఆటో నెల్లూరు నుంచి బుచ్చికి వస్తోంది. ఈ క్రమంలో పెట్రోల్ బంక్ సమీపంలో కారు ఎదురుగా వచ్చి ఆటోను బలంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి ఊరు మండలంలోని పంచేడు గ్రామంగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ శాఖలో 42 మందికి పోస్టింగ్‌లు



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): ఏపీపీఎస్సీ గ్రూప్–4లో ఉత్తీర్ణులై జిల్లా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికైన వారిని జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ అభినందించారు. గురువారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన కౌన్సెలింగ్‌లో 42 మంది సర్టిఫికెట్లు పరిశీలించి వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బాధ్యతగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.40
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	153
లేయర్ (లైవ్) :	105
బ్రాయిలర్ చికెన్ :	260
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	290
లేయర్ చికెన్ :	178